వరాహం.. ఏమిటో వ్యవహారం!

- యథేచ్ఛగా పందుల స్వైరవిహారం
- తూతూమంత్రంగా నిర్మూలన చర్యలు
- మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి

పెద్దాపురం: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులకు గురైనప్పుడు మాత్రమే మున్సిపల్ అధికారులకు పరిశుభ్రత, పారిశుద్ధ్యం గుర్తుకొస్తుంది. రోగాలకు కారణమవుతున్న పందులు నిత్యం జనావాసాల మధ్య స్వైరవిహారం చేస్తున్నా, మున్సిపల్ పారిశుధ్య యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తోంది. పట్టణంలో ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్న సమయాల్లో ముందస్తు చర్యలు చేపడతున్నామని అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారే కానీ, వాటిపై చర్యలు తీసుకోవడం లేదనడానికి పందుల స్వైరవిహారమే నిదర్శనం. ఇటీవల పట్టణంలో పందుల నిర్మూలన చేస్తున్నామంటూ హామీలిచ్చి, ఆచరణలో మమ అనిపించారు. పందుల పెంపకందారులకు నోటీసులు జారీ చేశామంటూ కాలయాపన చేస్తున్నారు మినహా, పట్టణంలో పందుల నిర్మూలనపై చర్యలు చేపట్టిన దాఖల్లాలేవు.

ఫిర్యాదులందినా షరా మామూలే..

గతంలోనూ సామాజిక మాధ్యమాల్లో పట్టణంలోని పందుల సమస్యపై చర్యలు తీసుకోవాలంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వాటిపై దృష్టి సారించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పందుల వల్లే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పట్టణానికి దూరంగా అవి ఉన్నా ఫర్వాలేదంటూ పందుల పెంపకందారులకు హుంకుం జారీ చేసిన మున్సిపల్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందంటున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి, పట్టణంలో పందుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పల్లెల్లోనూ..

పందుల స్వైర్య విహారం పట్టణ ప్రాంతంతో పాటు, మండలంలోని ఆయా గ్రామాల్లోనూ తీవ్రంగా ఉంది. ప్రధానంగా మేజర్ పంచాయతీలైన కట్టమూరు, దివిలి గ్రామాలతో పాటు, స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయ స్నానఘట్టం వద్దనే పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. అదే విధంగా కట్టమూరు గ్రామ శివారు జె.తిమ్మాపురం వెళ్లే రహదారిలో జోడుగుళ్ల వద్ద పందుల స్థావరం ఉన్నా, పంచాయతీ అధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.



పెద్దాపురం పట్టణంలో సంచరిస్తున్న పందులు

పట్టించుకోవడం లేదు



పందుల స్వైర్య విహారం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో ఏ మూల చూసినా పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. చర్యలు తీసుకోవడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారు.

– తాడి కస్తూరి, గృహిణి, నాగంపేట, పెద్దాపురం

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పందుల సంచారం, అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలి. డెంగీ, సీజనల్ వ్యాధులపై అనుమానం ఉంటే వెంటనే ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించి, చికిత్స చేయించుకోవాలి.

– డాక్టర్ సూర్యకుమారి, ఏరియా ఆస్పత్రి వైద్యురాలు, పెద్దాపురం

నోటీసులిచ్చాం, కేసులు పెట్టాం..



పందుల స్వైరవిహారంపై సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చాం. అయినా పందుల సంచారంపై కింది స్థాయి సిబ్బందికి పూర్తి ఆదేశాలు ఇచ్చాం. వెంటనే పందుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం. ఇకపై శాశ్వత పరిష్కారంపై దృష్టి పెడతాం.

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

క్లుప్తంగా

అధినేతను కలిసిన దొరబాబు



వైఎస్ జగన్‌తో దవులూరి దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్ వెళ్లిన దొరబాబు తిరుగు ప్రయాణంలో విజయవాడలో దిగి, తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితిపై చర్చించినట్టు తెలిసింది.

అధికారులకు ఈఓ సత్కారం



అధికారులను సత్కరిస్తున్న ఈఓ, ఆలయ పండితులు

సామర్లకోట: మహా శివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గత నెల 24 నుంచి మార్చి ఒకటి వరకు విధులు నిర్వహించిన వివిధ శాఖల అధికారులను ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం బుధవారం సత్కరించారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి కేవీ సూర్యనారాయణ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్, పొల్యూషన్, ఏపీఈపీడీసీఎల్ ఆధికారులతో పాటు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఆలయం వద్ద తమ సిబ్బందితో భక్తులకు ఉత్తమ సేవలందించారని ఈఓ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులను సత్కరించి, ఆలయ పండితుల ఆశీర్వచనాలు, స్వామివారి ఫొటో, ప్రసాదాన్ని అందజేశారు.

మందుబాబు హల్‌చల్



రోడ్డు మధ్యలో పడుకున్న మందుబాబు

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో ఓ మందుబాబు బుధవారం హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో రోడ్డు మధ్యలో పడుకుని, వాహనాల రాకపోకలను అడ్డుకోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో అటుగా వెళుతున్న సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆ మందుబాబును గమనించి, స్థానికుల సాయంతో రోడ్డు మార్జిన్‌లో సురక్షిత ప్రదేశానికి చేర్చారు.


సెల్‌ఫోన్ల రికవరీ



సెల్‌ఫోన్‌ను ఫిర్యాదుదారుకు అందజేస్తున్న సీఐ

సామర్లకోట: మహా శివరాత్రి సందర్భంగా దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున పోలీసు అధికారులు అనేక ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల నేపథ్యంలో బస్సు కాంప్లెక్స్‌లో సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బుధవారం ఫిర్యాదుదారులకు అందజేసినట్లు సీఐ కృష్ణభగవాన్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై

సామర్లకోట: ఎండ తీవ్రత పెరగడంతో స్థానిక బస్సు కాంప్లెక్స్ కంట్రోలర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు బుధవారం ప్రారంభించారు. గురజాల సర్వీసు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. వేసవి పూర్తయ్యే వరకు ప్రయాణికులకు కూలింగ్ వాటర్ అందజేస్తారని కంట్రోలర్ చెట్ల వజ్రం తెలిపారు.

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కరుణకుమార్

పెద్దాపురం: కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా తోట కరుణకుమార్‌ని నియమిస్తూ డీసీసీ ప్రకటించింది. బుధవారం కాకినాడలో మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పళ్లంరాజు ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పేరును ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు కరుణకుమార్ ఆనందం వ్యక్తం చేశారు.

గోతులు పూడ్పించిన ట్రాఫిక్ ఎస్సై



గోతులను పూడ్పిస్తున్న ఎస్సై గరగారావు

సామర్లకోట: ఆర్‌అండ్‌బీ అధికారుల పనిని ట్రాఫిక్ ఎస్సై చేయించడంతో వాహన చోదకులు విస్తుపోయారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువ భాగంలో కాకినాడ రోడ్డులో రైల్వే గూడ్స్ యార్డు వద్ద భారీ గోతులున్నాయి. రాత్రి సమయంలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు స్పందించి, తారుతో కలిపిన మిక్సర్‌తో బుధవారం రాత్రి గూడ్స్ యార్డు వద్ద ఉన్న గోతులను పూడ్పించారు. ట్రాఫిక్ ఎస్సై గరగారావును ప్రయాణికులు అభినందించారు.

ఇళ్ల స్థలాల సర్వే వేగవంతం చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ మల్లిబాబు

కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు

పిఠాపురం: ఇళ్ల స్థలాల సర్వే వేగవంతం చేయాలని కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, రీసర్వే, మ్యుటేషన్, పీజీఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్ తదితర వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమీక్షలో తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్లు సౌజన్య, మస్తాని, సర్వేయర్ కేదారేశ్వర్, ఆర్ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలి

సీఐ కృష్ణభగవాన్



సదస్సులో మాట్లాడుతున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సీఐ కృష్ణభగవాన్ మాట్లాడుతూ, నేటి బాలికలే రేపటి మహిళలని, పురుషులతో సమానంగా మహిళలు ప్రగతి పథంలో పయనించడానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఇంటర్నెట్, సోషల్ మీడియాను పరిమితంగా వాడుకుని ప్రయోజనం పొందాలన్నారు. అదే సమయంలో తప్పుడు దారిలో పడకుండా దానిపై అవగాహన పెంచుకోవాలన్నారు. మంచి అలవాట్లతో ఉన్నత స్థితికి చేరాలని హితవు పలికారు. హెచ్ఎం సాయిరామకృష్ణ మాట్లాడుతూ, మహిళాభ్యున్నతికి విశేష కృషి చేసిన వారి నుంచి విద్యార్థినులు స్ఫూర్తి పొందాలన్నారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.గోవింద్, కె.అరుణ, ఏఎల్‌వీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వేట్లపాలెంలో ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చినట్టు ఎంఈఓ–2 పి.పుల్లయ్య తెలిపారు. పాఠశాలలో విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఐసీడీఎస్ పీడీ విజయ కుమారి, సీడీపీఓ ఉష, ఎంఈఓ–2 పుల్లయ్య, జీసీపీఓ ఉమామహేశ్వరి సోమవారం విచారణ చేసిన విషయం విదితమే. బాలురతో అసభ్యంగా ప్రవర్తించిన సోషల్ టీచర్‌ను, ఉపాధ్యాయులను, విద్యార్థులను మభ్యపెట్టి తప్పుడు ఫిర్యాదు చేయించిన హిందీ టీచర్‌ను సస్పెండ్ చేస్తూ, పాఠశాలకు ఉత్తర్వులు వచ్చినట్టు ఎంఈఓ తెలిపారు. ఉత్తర్వులు తీసుకునే సమయంలో సోషల్ టీచర్‌కు ఫిట్స్ రావడంతో సామర్లకోట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. విచారణలో తనను ఇరికించారని ఆరోపిస్తూ హిందీ టీచరు సస్పెన్షన్ కాపీని తీసుకోవడానికి నిరాకరించినట్టు తెలిసింది. దీనిపై వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అనురాధను వివరణ కోరగా సోషల్ టీచరు ఆస్పత్రిలో ఉండడంతో పోస్టులో కాపీని పంపుతామని తెలిపారు. ఈ విషయాన్ని డీఈఓకు చెప్పగా, సస్పెన్షన్ కాపీ అందజేత నిలిపివేయాలని సూచించినట్టు హెచ్ఎం చెప్పారు.

ప్లాస్టిక్ వస్తువులు వాడితే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ కనకారావు

పిఠాపురం: వ్యాపారులు ప్లాస్టిక్ వస్తువులు వాడినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు హెచ్చరించారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు బుధవారం పట్టణంలో అనేక దుకాణాలపై దాడులు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను, వస్తువులను స్వాధీనం చేసుకుని, వ్యాపారులకు రూ.5 వేల జరిమానాలు విధించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎవరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను, వస్తువులను ఉపయోగించరాదని కమిషనర్ స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ సామగ్రి

ఆదమరిస్తే అంతే సంగతి..!



చేబ్రోలు రథం బాట వీధిలో ప్రమాదభరితంగా ఉన్న గొయ్యి

పిఠాపురం: నిత్యం వందలాది మంది జనం ఆ ప్రధాన రహదారిలో తిరుగుతుంటారు. అలాంటి రోడ్డు మధలో పెద్ద గొయ్యి తీసిన పంచాయతీ సిబ్బంది దాని సంగతే మర్చిపోయారు. దీంతో నిత్యం ఎవరో ఒకరు ఆ గోతిలో పడి గాయాలపాలవుతున్నారు. ఎన్నిసార్లు పంచాయతీ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు రథం బాట వీధిలో ఇటీవల మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం గోతిని తవ్వారు. మరమ్మతులు పూర్తయి వారం రోజులైనా దానిని పూడ్చిపెట్టకపోవడంతో స్థానికులకు అది ప్రాణసంకటంగా మారింది.

శిలువ ధ్యాన కూడికలు ప్రారంభం



సామర్లకోట చర్చిలో శిలువ ధ్యాన ప్రార్థనల్లో క్రైస్తవులు

సామర్లకోట: ఏసు క్రీస్తు శిలువ ధ్యాన కూడికలుగా క్రైస్తవ ప్రజలు ఆచరించే 40 దినాల శ్రమల కాల కూడికలు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. బస్మ బుధవారంగా పిలుస్తూ ఈ శిలువ ధ్యాన కూడికలు మండలంలోని అన్ని చర్చిలలో మొదలయ్యాయి. ఏప్రిల్ 18 గుడ్ ఫ్రైడే వరకు క్రైస్తవులు ఉపవాస దీక్షలతో ప్రార్థనలు చేస్తారు.

విష ప్రభావంతో చనిపోయిన చేపలు



చెరువులో చనిపోయి తేలుతున్న చేపలు

సామర్లకోట: మండలంలోని అచ్చంపేట పంచాయతీ చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషపూరిత ఎరువులను కలపడంతో వందలాది చేపలు చనిపోయి చెరువులో తేలాయి. పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులో చేపల పెంపకానికి వేలం నిర్వహించడంతో, మత్స్యకారులు చెరువును లీజుకు తీసుకుని చేపలు పెంచారు. చేపలు పట్టుబడికి వచ్చే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు విషపూరిత ఎరువులను కలపడంతో అవి చనిపోయాయని లీజుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

కత్తులగూడేన్ని ముంచెత్తుతున్న చెత్త

పట్టించుకోని మున్సిపల్ అధికారులు



బర్నింగ్ టూల్స్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో మెషీన్‌తో తొలగిస్తున్న చెత్త

పిఠాపురం: పట్టణంలోని కత్తులగూడెంపై చెత్త దాడి చేస్తోంది. మూడు వార్డులకు చెందిన మురుగుతో పాటు, చెత్త కాలువ ద్వారా వచ్చి కత్తులగూడెం వద్ద పేరుకుపోతుండడంతో ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని పర్యాయాలు ఫిర్యాదులు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కత్తులగూడెం నివాసులు వాపోతున్నారు. మురుగంతా ఒకచోట చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో పాటు, క్రిమికీటకాదులు పెరిగి తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బర్నింగ్ టూల్స్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కాలువకు మరమ్మతులు చేసి, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ చెల్లూరి లోవరాజు మాట్లాడుతూ, ఇప్పటికే అనేక సార్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, కౌన్సిల్ కూడా ఈ సమస్యను లేవనెత్తినా కమిషనర్ ఏమీ పట్టించుకోవడం లేదన్నారు.

వీడని మృతదేహం మిస్టరీ

- ఆధారాలు, పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా హత్యగా నిర్ధారణ
- కేసు దర్యాప్తునకు నాలుగు బృందాలు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు 216 జాతీయ రహదారి పక్కన రెండు రోజుల క్రితం లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ఈ కేసు ఇంకా ఓ కొలిక్కి రాకపోవడంతో.. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు పోలీసు బృందాలు కేసు దర్యాప్తుపై దృష్టి సారించాయి. సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయసు, ఎటువంటి దుస్తులు, ఇతర వస్తువులు లేకుండా పడి ఉన్న పురుషుడి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహం తీరును పరిశీలించి హత్య కేసుగా నిర్ధారణకు వచ్చారు. మృతదేహం తీరును బట్టి సంఘటన జరిగి సుమారు మూడు రోజులు అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి దుస్తులు, మొలతాడు, చేతి కంకణం వంటి వస్తువులు మృతదేహం పడి ఉన్న సమీపంలోనే దొరకడంతో పాటు, మృతుడి ఒంటిపై కత్తి పోట్లు ఉండడంతో, అతడిని ఎవరో హతమార్చి ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లకు మృతుడి ఫొటోలు పంపిన పోలీసులు.. గల్లంతైన వ్యక్తుల సంఘటనలపై ఆరా తీస్తున్నారు. ఇక్కడ దొరికిన మృతదేహం ఆనవాళ్లు ఉన్న మిస్సింగ్ కేసులు ఎక్కడైనా ఉన్నాయన్న దానిపై దృష్టి సారించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం వివరాలు తెలిసే వరకు అసలు అది హత్య లేక మరేమన్నా జరిగిందా అనేది బయటపడే అవకాశం లేదు. దీంతో వ్యక్తి ఆచూకీ తెలుసుకునేందుకు నలుగురు ఎస్సైలతో కూడిన నాలుగు బృందాలతో గాలింపు చేపట్టారు. ఇప్పటికే వైజాగ్‌లో ఇదే పోలికలతో ఉన్న ఒక వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదు కావడంతో, అక్కడకు వెళ్లిన పోలీసు బృందం వివరాలు సేకరిస్తున్నారు.

ఆధారాలు లభ్యం కావడంతో..

మృతదేహం వద్ద లభ్యమైన కంకణం ఆధారంగా మృతుడిది భీమవరం అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆధారాలను మాయం చేసే పనిలో భాగంగా నిందితులు మృతుడి వస్తువులు, దుస్తులు దూరంగా పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆధారాలు సేకరించిన క్లూస్‌టీం, పోస్ట్‌మార్టం రిపోర్టులో హత్యగా నిర్ధారణ కావడంతో, హత్య చేసి ఇక్కడ పడేశారని నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఒకవైపు వ్యక్తి ఆధారాలు సేకరిస్తూనే, ఆరోజు రాత్రి ఈ రోడ్డుపై వెళ్లిన వాహనాలు, సంచరించిన వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిసింది. ఆ రోజు వాహనాల కదలికలపై సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు, హత్య ఇక్కడ చేశారా లేక ఎక్కడైనా చేసి ఇక్కడ మృతదేహాన్ని పడేశారా అన్న విషయంపై ఆరా తీస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తాత్కాలిక నివాసానికి సమీపంలో ఈ సంఘటన చోటు చేసుకోవడంతో కేసు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు.. ఎంత వీలైతే అంత త్వరగా ఛేదించాలని పట్టుదలతో ఉన్నట్లు సమాచారం.